క్లుప్తంగా

చలివేంద్రాలు ప్రారంభం



నకరికల్లు: ఉద్యోగాల రీత్యా వేరేప్రాంతాల్లో ఉన్నప్పటికీ స్వగ్రామాన్ని మరువకుండా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయని సర్పంచ్ జూపల్లి మోషే అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోని ఆరు కూడళ్లలో గుండ్లపల్లి ఎంప్లాయీస్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం చలి వేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మోషే మాట్లాడుతూ బస్టాపుల వద్ద అలాగే ప్రధాన కూడళ్లు ఎంచుకొని ఏర్పాటు చేసిన చలివేంద్రాలు ఎందరికో దప్పికను తీర్చేందుకు తోడ్పతాయని అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు చందా మీరా, కార్యదర్శి కొలుముల ఇమామ్‌వలి, దాచేపల్లి రహీం, గండు మస్తాన్ వలి, జమాల్ అల్లాభక్షు, దాచేపల్లి సుభాని, అడవి సుభాని, కొలిమి సుభాని, ముజావర్ మాభు సుభాని తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్ సీఐగా కిరణ్



పి.కిరణ్



ఎంవీ సుబ్బారావు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.కిరణ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుంటూరు దిశ పోలీస్‌స్టేషన్ నుంచి సాధారణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎంవీ సుబ్బారావును సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. సోమవారం ఎంవీ సుబ్బారావు సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేస్తున్న ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావును గుంటూరు రేంజ్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు వెలువడ్డాయి.

చల్లగుండ్ల తిరునాళ్లలో పాల్గొన్న డాక్టర్ 'గజ్జల'



నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో నిర్వహించిన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల వేడుకల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సు.దీర్‌భార్గవ్‌రెడ్డి పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం వైఎస్సార్ సీపీ రెడ్డియూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ వేదిక పైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. ఉగాది పర్వదినం శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు జక్కిరెడ్డి కోటిరెడ్డి, అంజిరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



పెదకూరపాడు: దాతృత్వాన్నికి నిదర్శనం రంజాన్ అని మాగులూరి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాగులూరి భాను ప్రకాష్ అన్నారు. మండలంలోని హుస్సేన్‌నగరం గ్రామంలో ముస్లిం కుటుంబాలకు ఫౌండేషన్ అధ్వర్యంలో రంజాన్ తోఫాను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ మాట్లాడుతూ కఠోర ఉపవాసం ఉండి, దాన ధర్మాలు చేసి, తోటివారిపై ప్రేమను చాటే ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. ప్రతి ఒక్కరు పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. నిర్వాహకులు కుంచనపల్లి కిరణ్‌కుమార్, కొండవీటి ప్రసాద్, మాగులూరి కృష్ణారావు పాల్గొన్నారు.

నకరికల్లు: పవిత్ర రంజాన్ మాసంలో తోటివారికి సాయపడడం పుణ్యకార్యమని గుండ్లపల్లి ఎంప్లాయీస్ హెల్పింగ్‌హ్యాండ్స్ యూనియన్ అధ్యక్షుడు చందా మీరా అన్నారు. గుండ్లపల్లి గ్రామంలోని 70 నిరుపేద కుటుంబాలకు, పారిశుధ్య కార్మికులకు సోమవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారు సైతం పండుగను ఆనందంతో జరుపుకోవాలని యూనియన్ తరఫున తమవంతుగా తోఫాను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కొలుముల ఇమామ్‌వలి, దాచేపల్లి రహీం గ్రామస్తులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

పెదకూరపాడు: పెదకూరపాడులోని పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను సోమవారం అరెస్టు చేసినట్లు పెదకూరపాడు ఎస్‌ఐ గిరిబాబు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1720 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విశ్వాసం..ఆనందం..ఈద్

- భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫిత్ర్
- ముగిసిన నెల రోజుల కఠోర ఉపవాసాలు
- మసీదులు, ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలకు పోటెత్తిన ముస్లింలు
- ఒకరికొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు



అమరావతి బస్టాండు సెంటర్ ఉన్న ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



రెడ్డిగూడెం ఈద్గా వద్ద రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకొంటున్న బాలురు

సత్తెనపల్లి: స్వార్థ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా తోచినంత సాయం అందించే వాడే ముస్లిం అని పలువురు మత పెద్దలు తెలిపారు. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ఈద్-ఉల్-ఫిత్ర్ (రంజాన్) వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధల నడుమ సాగాయి. మసీదులు, ఈద్గాల్లో చేపట్టిన సామూహిక ప్రార్థనలకు ముస్లింలు పోటెత్తారు. సత్తెనపల్లి పట్టణంలోని మాచర్ల రోడ్‌లో గల ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక నమాజులు చేపట్టారు. ప్రతి ముస్లిం తమ జీవితంలో ఖురాన్ బోధించిన పంచ సూత్రాలను పాటించాలని మత పెద్దలు సూచించారు. దానధర్మాలకు ఆత్మీయ పండుగ ఈద్ ఉల్ ఫిత్ర్ (రంజాన్) అని వివరించారు. ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. తోటి మిత్రులు, బంధువులను ఇళ్లకు ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు.

నకరికల్లులో...

నకరికల్లు: పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. నకరికల్లులో విశాలమైన చెరువు చెంత ఎత్తయిన కొండపై గల 70 ఏళ్ల నాటి ఈద్గా వద్ద ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈదుల్ ఫితర్ నమాజును ముస్లింలు పఠించారు. ముందుగా కొండపై గల ఈద్గా వద్దకు చేరుకున్నారు. మతపెద్దలు ముఫ్తీ, కరిముల్లా రంజాన్ పండుగ గొప్పతనాన్ని, ఈదుల్ ఫితర్ ఆవిర్భావ ప్రాముఖ్యతను వివరించారు. పవిత్ర ఖురాన్‌ను పఠించారు. అనంతరం సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రపంచశాంతి కోసం దువా చేశారు. నమాజు అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వక్ఫ్‌బోర్డు బిల్లుకు నిరసనగా నల్లబ్యాడ్జీలతో ప్రార్థనలకు..

కేంద్రం ప్రవేశ పెట్టనున్న వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా పలువురు ముస్లింలు నల్లరిబ్బన్లు చేతికి కట్టుకొని నిరసన తెలుపుతూ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెడుతున్న వక్ఫ్‌బిల్లుతో ముస్లిం మైనారిటీలకు తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు చేతికి నల్ల రిబ్బన్ కట్టుకొని శాంతియుత నిరసన ప్రకటించినట్లు తెలిపారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రెడ్డిగూడెం, గణపవరం, ఇనిమెట్ల, మొక్కపాడు, అనుపాలెం, కోటనెమలిపురి, కొండమోడు తదితర గ్రామాలలో గల ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అమరావతిలో...

అమరావతి: రంజాన్ పండుగ వేడుకలను సోమవారం మండల కేంద్రమైన అమరావతిలో ముస్లింలు ఘనంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. తొలుత ముస్లిం సోదరులందరూ బృందావన్ హోటల్ సెంటరు మసీదు నుంచి బస్టాండ్ సెంటరులోని ఈద్గా వద్దకు ప్రదర్శనగా వెళ్లి మతగురువు మౌలానా వలిఉల్లా ఆధ్వర్యంలో రంజాన్ ప్రార్థనలను నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలను తెలుపుకొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: పవిత్ర రంజాన్ పండుగను సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. క్రోసూరు, పీసపాడు, 88త్యాళ్లూరు, నాగవరం, గుడిపాడు, హసనాబాద్, దొడ్లేరు, ఆవులవారిపాలెం, అనంతవరం, ఊటుకూరు, బయ్యవరం తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండుగ ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మసీదులు, ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రోసూరులోని షాదీఖానాలోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక నమాజులు ఆచరించారు.



సత్తెనపల్లిలోని ఈద్గాలో సామూహిక నమాజ్‌లో ముస్లింలు

అచ్చంపేటలో..

అచ్చంపేట: మండలంలో రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు ఖురాన్ పఠనం చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెం, నందిరాజుపాలెం, మాచాయపాలెం పునరావాస కేంద్రాలలో వేకువ జామునే ప్రార్థనల్లో పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మండల కేంద్రమైన బెల్లంకొండలో బ్యాంక్ సమీపంలో గల మసీదు వద్దకు అధిక సంఖ్యలో చేరి ప్రత్యేక నమాజ్ కార్యక్రమాలను నిర్వహించారు. అదే విధంగా అధిక సంఖ్యలో ఈద్గా వద్దకు తరలివెళ్లారు. అనంతరం మధ్యాహ్నం, సాయంత్ర సమయాలలో మసీదులకు వెళ్లి భక్తితో ప్రార్థనలను చేశారు.



నకరికల్లులోని కొండపై గల ఈద్గా వద్ద పవిత్ర ఖురాన్ పఠనం చేస్తున్న ముఫ్తీ

ముప్పాళ్లలో..

ముప్పాళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లోను రంజాన్ పర్వదినాన్ని ముస్లింసోదరులు సోమవారం ఘనంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకొని మసీదులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆయా గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముప్పాళ్ల, మాదల గ్రామాల్లోని ఈద్గాల వద్ద జరిగిన సామూహిక ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు.

పెదకూరపాడులో ప్రత్యేక ప్రార్థనలు



పెదకూరపాడులో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

పెదకూరపాడు: ఉపవాసం, ప్రార్థన, దాతృత్వం, ఆధ్యాత్మిక ఎదుగుదల, క్రమశిక్షణ, సత్ప్రవర్తనే రంజాన్ సందేశమని ఇమామ్ మస్తాఫా అన్నారు. పవిత్ర రంజాన్ వేడుకలను ముస్లింలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ముస్లింలు భారీ ర్యాలీగా ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రార్థనలకు హాజరయ్యారు. ప్రపంచశాంతి కొరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని లగడపాడు, చిన్నమక్కెన, పాటిబండ్ల, పాడపాడు, తమ్మవరం, 75త్యాళ్ళూరు, హస్సేన్‌నగరం గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

లస్సీ, వాటర్ బాటిళ్లు పంపిణీ

రంజాన్ పర్వదినం సందర్భంగా పెదకూరపాడుకు చెందిన జవ్వాది సతీష్, బత్తుల మల్లి ప్రార్థనలకు వచ్చే రహదారిలో మజ్జిగ, లాస్సీ, వాటర్ బాటిళ్లలను ముస్లింలకు అందించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



ప్రార్థనలకు వెళుతున్న ముస్లింలకు లస్సీ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న హిందువులు



వక్ఫ్‌బోర్డు బిల్లును నిరసిస్తూ నకరికల్లులో నల్లరిబ్బన్‌లు ధరించి నమాజులో పాల్గొన్న ముస్లింలు



దొడ్లేరు గ్రామంలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు



అచ్చంపేట ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

మహిళ ఉద్యమానికే 'ఉదయం' స్ఫూర్తిదాయకం

ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ

సత్తెనపల్లి: కామ్రేడ్ మోటూరు ఉదయం మహిళా ఉద్యమానికి స్ఫూర్తి దాయకమని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో సోమవారం జరిగిన మోటూరు ఉదయం వర్ధంతి సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. సభకు ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజని అధ్యక్షత వహించారు. ఉమాశ్రీ మాట్లాడుతూ కామ్రేడ్ మోటూరు ఉదయం స్త్రీ జనోద్ధరణకు ఎంతగానో కృషి చేశారన్నారు. బుర్రకథ ఆమె ఉద్యమానికి ప్రధాన ఆయుధంగా ఉండేదన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని 1970-80ల్లో ఎందరో సినీ దర్శకులు శక్తివంతమైన మహిళల పాత్రలను సృష్టించారన్నారు. తొలుత ఉదయం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా నాయకులు ధరణికోట విమల, తుమ్మల లక్ష్మి, కట్ట రమాదేవి, ఇంజం అరుణ, కె.సుధ, మునగా భారతి, స్పందన, సాయి, బిందు, ప్రజాసంఘాల నాయకులు కె.శివ దుర్గారావు, చందా ఆంజనేయులు, షేక్ మస్తాన్‌వలీ పాల్గొన్నారు.



మోటూరు ఉదయం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు, తదితరులు

కులవ్యవస్థ ఉన్నంత వరకూ అసమానతలు వీడవు

నాదెండ్ల: కుల వ్యవస్థ ఉన్నంత కాలం అస్పృశ్యత, సామాజిక వివక్ష రూపాలు మార్చుకుంటూ కొనసాగుతూనే ఉంటుందని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. కనపర్రు ఎస్సీ కాలనీలో సోమవారం సమావేశం నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్ళు అయినా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు వివక్ష, అణచివేతకు గురౌతున్నారన్నారు. జనాభా ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. విద్య, వైద్యం, పరిశ్రమలు ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తేనే అసమానతలు తొలగుతాయన్నారు. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు జరిగేలా ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. భారతదేశ సంపదలో అగ్రభాగం కేవలం 10 శాతం మంది చేతుల్లో పోగుపడిందని, 145 కోట్ల జనాభాలో 90 శాతం మంది ఆర్థిక అసమానతలతో సతమతమౌతున్నారన్నారు. దేశాన్ని సుస్థిర అభివృద్ధి, అసమానతలు లేని విధంగా పాలించే నాయకులకే రాబోయే రోజుల్లో ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటరావు, వెంకటనారాయణ, ఉసర్తి బుజ్జి, సాయి పాల్గొన్నారు.



కనపర్రు ఎస్సీ కాలనీలో మాట్లాడుతున్న సీహెచ్ సుబ్బారావు

98.2 శాతం పశువుల సర్వే పూర్తి

శావల్యాపురం: జాతీయ పశు గణాంకాల సర్వే పనులు 98.2 శాతం పూర్తి అయినట్లు స్థానిక పశువైద్యశాల వైద్యాధికారి సోముల గుణధీర్ అన్నారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలలో పశువులు-16 వేల 976, జీవాలు-14130 ఉన్నాయని 6 మంది ఎన్యూమెటర్లు ఇద్దరు సూపర్‌వైజర్లు పర్యవేక్షణలో సర్వే కార్యక్రమం విజయవంతం చేసినట్లు తెలిపారు. పశు గణాంక సర్వే వలన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో నిధులు కేటాయింపు టీకాలు, మందులు, రాయితీ పథకాలు తదితరవన్నీ అంచనాలు వేయటానికి దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం సర్వే చేసిన అంశాలన్నీ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు పనులు చేస్తున్నట్లు తెలిపారు. రైతు సమగ్ర వివరాలు, ఆధార్, సెల్‌ఫోను నంబరు.ట్యాగ్ నంబరు, తదితరవన్నీ తప్పులు లేకుండా పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పదిరోజుల వ్యవధిలో ఆన్‌లైన్ పనులు పూర్తి అవుతాయన్నారు.



రూ.50 లక్షలతో దేవాలయ పునర్నిర్మాణం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరులో రూ.50 లక్షలతో గంగమ్మ తల్లి దేవాలయం పునః నిర్మాణ పనులు తుది దశకు చేరినట్లు ఆలయ కమిటీ ప్రతినిధి ముంద్రు రాఘవరావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు, దాతలు సహకారంతో దేవాలయ నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. తిరుమల-తిరుపతి దేవస్థానం రూ.10 లక్షలు సహకారం అందించినట్లు వివరించారు. ప్రస్తుతం రంగులు వేస్తున్నారని, ఈనెల 21 నుంచి దేవాలయ ప్రతిష్టా కార్య క్రమం ప్రారంభమవుతాయని 23న గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం వైభవంగా జరుగుతుందని వివరించారు.

పురాతన ఇత్తడి సామగ్రి చోరీ

పెదకూరపాడు: ఖాళీగా ఉంటున్న ఇంట్లో పురాతన ఇతడి సామగ్రి చోరీకి గురైన సంఘటన మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పెదకూరపాడు ఎస్‌ఐ గిరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. 75త్యాళ్ళూరుకు చెందిన సూరెపల్లి లక్ష్మీ నరసింహారావు ఉద్యోగరీత్యా గుంటూరులో గత పదేళ్లుగా నివాసం ఉంటున్నారు. 75త్యాళ్ళూరులో ఉన్న సొంత ఇంటికి అప్పుడప్పుడు వస్తారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నరసింహారావు, అతని భార్య నాగలక్ష్మి ఇంటికి రాగా, తాళాలు తెరిచి ఉండటం చూసి ఇంటిలోని సామగ్రిని పరిశీలించగా, పురాతన ఇత్తడి సామగ్రి కనిపించకపోవడంతో చుట్టపక్కల వారిని ఆరా తీశారు. వారు మాకు తెలియదని చెప్పడంతో పెదకూరపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరిబాబు తెలిపారు.

యువకుడికి దేహశుద్ధి.. పోలీసులకు ఫిర్యాదు

సత్తెనపల్లి: యువకుడికి దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... ముప్పాళ్ళ మండలం నార్నెపాడు గ్రామానికి చెందిన ఓ యువకుడు సత్తెనపల్లిలోని క్రిస్టియన్ పేటలో ఇంటి నిర్మాణ పనులు చేపట్టేందుకు కొద్ది రోజులుగా వస్తున్నాడు. ఈ క్రమంలో క్రిస్టియన్ పేటకు చెందిన ఓ వికలాంగురాలితో పరిచయం పెంచుకొని ఆమెపై లైంగికదాడి చేసినట్లు సమాచారం. విషయం ఆమె పెద్దలకు తెలపడంతో వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేసిన క్రమంలో యువకుడు అడ్డం తిరగాడు. దీంతో దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై రాజీ చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఇంకా ఎలాంటి కేసు నమోదు కాలేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పెదకూరపాడు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన పెదకూరపాడులో సోమవారం జరిగింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షేక్ జానీ రంజాన్ ప్రార్థనలు ముగించుకొని పెరుగు ప్యాకెట్ తీసుకునేందుకు ఇంటి నుంచి కాలచక్ర రహదారిలోని దుకాణానికి వెళ్తున్న సమయంలో చిన్నమక్కెన గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి పూటుగా మద్యం సేవించి షేక్ జానీని బలంగా ఢీకొనడంతో జానీ తల వెనుక భాగం, తొంటి, కాలు చేతులకు తీవ్రగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స కోసం 108 వాహనంలో పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, మెరుగైన వైద్యసేవలు నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మద్యం సేవించి వాహనం నడిపిన భాస్కర్‌రెడ్డికి కూడా గాయాలయ్యాయి.



తీవ్రంగా గాయపడిన షేక్ జానీ

వైభవంగా రెడ్డి పేరంటాలమ్మ ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు సాతులూరు గ్రామంలోని రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయంలో సోమవారం వార్షికోత్సవం వైభవంగా జరిగాయి. ప్రతి ఏడాది ఉగాది పర్వదినాన ఆలయ వార్షికోత్సవం నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. భక్తులు వేకువజాము నుంచే ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రభలు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పలువురు దాతలు ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామస్తులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సౌకర్యార్థం బారికేడ్లతో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రాత్రి భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. మరో రెండు చోట్ల పాట కచేరీ నిర్వహించారు. సుమారు రెండు శతాబ్దాల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరటంతో రూ.2 కోట్ల వ్యయంతో నూతన ఆలయాన్ని నిర్మించిన విషయం విదితమే. మార్చి 17న పునః ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. ఆలయ వాస్తు సిద్ధాంతి నెమ్మికంటి నరసయ్యచారి, ఆలయ రాతి నిర్మాణ రూపకర్త సుబ్రహ్మణ్యాచారి, గోపుర శిల్ప కళాకారుడు పులకల లక్ష్మణను ఆలయ కమిటీ సభ్యులు సోమవారం బంగారు ఉంగరాలు, నూతన వస్త్రాలు బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ వజ్జా వీరాంజనేయులు, సభ్యులు జంపని లక్ష్మీనారాయణ, చెన్నబోయిన వెంకట సుబ్బారావు, తమ్మ సీతయ్య, వజ్జా రామారావు, నర్రా శ్రీనివాసరావు, వజ్జా వెంకటరావు, గొర్రె సాంబశివరావు పాల్గొన్నారు.



ఆలయంలో సన్మాన గ్రహీతలతో కమిటీ సభ్యులు

రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ప్రారంభం

బెల్లంకొండ: మండలంలోని కందిపాడు గ్రామంలో వేంకటేశ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా సోమవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను స్థానిక ఎస్‌ఐ డి.ప్రవీణ్, మండల టీడీపీ నాయకులు ప్రారంభించారు. మొదటి రోజు పోటీలలో భాగంగా సీనియర్, ఆరు పళ్ల సైజు ఎడ్లకు పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆరు పళ్ల సైజు గిత్తలు ఆరు జతలు పోటీలలో పాల్గొనేందుకు వచ్చాయన్నారు. బుధవారం నాలుగు పళ్లు, జూనియర్, సేద్యం విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ ప్రవీణ్, నాయకులు

పేరంటాళ్లమ్మ ఆదాయం రూ.6 లక్షలు

శావల్యాపురం: మండలంలోని శానంపూడి శివారు గ్రామమైన బొందిలిపాలెంలోని అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి ఆలయ తిరునాళ్ల సందర్భంగా దేవాలయానికి ఆదాయం రూ.6 లక్షల 37 వేల 158 వచ్చినట్లు దేవదాయ శాఖ అధికారి ఎం.సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. బహిరంగ వేలం ద్వారా రూ.లక్ష 36 వేల 500, భక్తులు విరాళాల రూపంలో ఇచ్చిన నగదు రూ.2 లక్షల 90 వేల 741, హుండీ కానుకల ఆదాయం రూ.ఒక లక్ష 91 వేల 587, చీరలు వేలంలో రూ.18 వేల 330 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గత ఏడాది కంటే ఈసారి అదనంగా ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అధికారులు హనుమంతరావు పి.వెంకటరెడ్డి, అమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.